క్లుప్తంగా

క్రీడల్లో రాణించాలి



గార్ల: విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో సైతం రాణించాలని ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ సూచించారు. గార్లలోని బాస్కెట్‌బాల్ మైదానంలో జరిగిన బాస్కెట్‌బాల్ సమ్మర్ కోచింగ్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం సమ్మర్ కోచింగ్‌లో బాస్కెట్‌బాల్ క్రీడలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు మెమొంటోలతోపాటు ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జాతీయస్థాయి అథ్లెటిక్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన సాంబమూర్తి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సూత్రపు జయశంకర్, పీడీ రామన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ఆదరించండి



మహబూబాబాద్ రూరల్: ప్రజలారా ప్రభుత్వ పాఠశాలలను ఆదరించండని భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షుడు తేళ్ల శ్రీనివాస్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలోని యాదవ కాలనీ, ముదిరాజ్ కాలనీ, హరిజన కాలనీ, రజక కాలనీలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూజారి మంగమ్మ, పూజారి వెంకన్న, వార్డు సభ్యులు యాకన్న, ఉపాధ్యాయులు సత్యశంకర్, లక్ష్మారెడ్డి, బలాష్టి రమేష్, యుగంధర్, బాలాజీ పాల్గొన్నారు.

మానవ అక్రమరవాణాను అరికట్టాలి

మరిపెడ: మానవ అక్రమ రవాణాను అరికట్టాలని ఎఫ్ఎంఎస్ఎస్ కోఆర్డినేటర్ నిరుడు శిరీషా అన్నారు. మండలంలోని వీరారం గ్రామంలో మహిళలకు మానవ అక్రమరవాణాపై మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్యవివాహాలను అరికట్టాలని, చిన్నపిల్లల కిడ్నాప్‌లను గుర్తించి ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలు వివాదాస్పద సందర్భాల్లో ప్రమాదంలో ఉన్నప్పుడు హెల్ప్‌లైన్ కోసం 100, 1098, 181, 1930 నంబర్లకు డయల్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ టీచర్ శ్రీవాణి, ఆయమ్మ నాగలక్ష్మి, సుగుణదేవి, ఏకమ్మ, శిరీష, శైలజ, నాగమణి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

మరిపెడ: పంట రుణం తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బానాల రాజన్న డిమాండ్ చేశారు. మరిపెడలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ప్రచారంలో భాగంగా ఇప్పుడు రుణం తీసుకున్న మాఫీ చేస్తానన్నాడన్నారు. ఇప్పుడు షరతులు అంటూ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నేటి వరకు అన్ని బ్యాంకుల్లో రైతులు తీసుకున్న పంట రుణాలపై రూ.2లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగన్న, ఉప్పలయ్య, వెంకన్న ఉన్నారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

కేసముద్రం: మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. కేసముద్రంస్టేషన్‌లో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో ఆసుపత్రి, మెడికల్‌షాపు పూర్తిగా దగ్ధం కావడంతో, షాపు యజమాని నష్టపోవాల్సి వచ్చిందన్నారు. వారిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు. ఇక్కడ రైస్‌మిల్లులు, ట్రేడింగ్ కంపెనీలతోపాటు ఇతర షాపులు ఉన్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన రాంబాబు



గూడూరు: మండలంలోని మట్టిమిట్ట శివారు తోటదస్రుతండాకు చెందిన బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గుగులోతు రాంబాబు, మంగళవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మూత‘బడి’కి పునరుజ్జీవం దక్కేనా?

- 14ఏళ్ల కిత్రం రాజ్‌మాన్‌సింగ్ పాఠశాల మూత
- పునఃప్రారంభించాలని కోరుతున్న స్థానికులు



రాజ్‌మాన్‌సింగ్ తండాలో మూతబడిన ప్రాథమిక పాఠశాల

పెద్దవంగర: తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మండలంలోని రాజమాన్‌సింగ్ తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు లేక మూత పడింది. నాటినుంచి నేటి వరకు తండాల్లో ప్రజలు తమ పిల్లలను స్తోమతను బట్టి వివిధ ప్రాంతాల్లో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్రం ప్రభుత్వం మూతబడిన పాఠశాలలను పున:ప్రారంభించాలని ప్రతి గ్రామపంచాయతీలో ప్రాథమిక పాఠశాల ఉండేలా చూడాలని ఆదేశాల జారీ అయినట్లు సమాచారం. ఈ మేరకు జిల్లాలో ఏడు పాఠశాలలను అందుబాటులోకి తేవడానికి సిద్ధమయ్యారు. అందులో మండలంలోని రాజ్‌మాన్‌సింగ్ ప్రాథమిక పాఠశాల ఒక్కటి ఉంది.

మండలంలో ఐదు జెడ్పీ, ఐదు ప్రాథమికోన్నత, 18 ప్రాథమిక పాఠశాలలతోపాటు కేజీబీవీ, జ్యోతి బాపూలే బాలుర పాఠశాలలు ప్రస్తుతం ఉన్నాయి. కాండ్యాతండా, రాజ్‌మాన్‌సింగ్ తండా, ఏనమీది తండాల్లో ప్రాథమిక పాఠశాలలు మూత పడ్డాయి. 2014లో పడమటి తండా, 2015లో భంద్రు తండా, 2016లో సోమ్లాతండా, 2022లో ఏనమీది తండాల్లోని ప్రాథమిక పాఠశాలలు మూత పడ్డాయి.

పాఠశాల తెరుచుకునేనా..

రాజ్‌మాన్‌సింగ్ తండాను గత ప్రభుత్వం నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసింది. ఈతండాకు మేఘ్యాతండా, దేవునిబాయి తండా అవాసతండాలు ఉన్నాయి. ఇందులో 879 జనాభా, 154 కుటుంబాలు ఉన్నారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో సెయింట్ పాల్ పాఠశాలకు 09, పీఎస్ఆర్ పాఠశాలకు 07, వికాస్ పాఠశాలకు 15మంది విద్యార్థులు చదువుకునేందుకు వెళ్తున్నారు. అందులో ప్రాథమిక విద్యను అభ్యసించేవారు సుమారు 22మంది ఉన్నారు. తండాలో పాఠశాలను తెరిస్తే ప్రాథమిక విద్యను అభ్యసించే 22 మంది విద్యార్థులు చేరడానికి సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. మూతబడిన పాఠశాలలను పునఃప్రారంభించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ కమిటీలు ప్రత్యేక చొరవ తీసుకుంటే ఈ ప్రభుత్వం బడులకు పునరుజ్జీవం పోయాలని ఆయా తండా వాసులు కోరుతున్నారు.

ఎలాంటి మార్గదర్శకాలు అందలేదు



విద్యాశాఖ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు అందలేదు. ఆదేశాలు వస్తే తప్పకుండా పాఠశాలలను పునఃప్రారంభిస్తాం. ఆదేశాలు అందిన వెంటనే తండావాసులతో సమావేశం చేపట్టి విద్యార్థులు పాఠశాలకు వచ్చే విధంగా తమ వంతు కృషి చేస్తాం.

– కళాధర్, ఇన్‌చార్జ్ నోడల్ అధికారి, పెద్దవంగర

కంకర మిల్లులో పేలుళ్లపై ఆందోళన



రోడ్డుపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కేసముద్రం: కంకర మిల్లులో పేలుళ్లతో భయాందోళనకు గురైన గ్రామస్తులు రాస్తారోకోకు దిగిన సంఘటన మండలంలోని అర్పనపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. అర్పనపల్లి గ్రామ సమీపంలోని కంకర క్రషర్ మిల్లులో సోమవారం రాత్రి జరిపిన పేలుళ్లతో భయాందోళనకు గురైనట్లు గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రాత్రి సమయంలో సంఘటన స్థలానికి ఎస్సై వంశీధర్ చేరుకుని పరిశీలించారు. కాగా మంగళవారం ఉదయం అర్పనపల్లి ప్రధాన రహదారిపై గ్రామస్తులు బైఠాయించి రాస్తారోకోకు దిగారు. మిల్లుకు అనుమతులను రద్దు చేసి సీజ్ చేయాలంటూ వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై వంశీధర్, తహసీల్దార్ దామోదర్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. కంకర మిల్లుకు ఎలాంటి అనుమతులు ఉన్నాయనే విషయాన్ని పరిశీలించి, జరిగిన ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక అందించి చర్యలు తీసుకుంటామని ఆందోళనకారులకు వారు హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు.

కార్మికుల పేరుతో డబ్బు వసూలు



ధర్నా చేస్తున్న హమాలీలు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్ బయట వేబ్రిడ్జి ద్వారా సరుకులు కొనుగోలు చేస్తున్న కొందరు వ్యాపారులు, కార్మికుల పేరుతో రైతుల వద్ద కూలీ డబ్బులను వసూలు చేస్తున్నారని ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు కంచ వెంకన్న ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల పేరుతో రైతుల వద్ద వసూలు చేస్తున్న డబ్బులను కార్మికులకే చెల్లించాలన్నారు. అదేవిధంగా మార్కెట్ రేట్ల పెంపు విషయంలో డీఎంఓ అగ్రిమెంట్ చేయవలసి ఉండగా, నెలల తరబడిగా పెండింగ్ పెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో హమాలీలు వేల్పుల వెంకన్న, మల్లయ్య, లక్ష్మణ్, సాంబయ్య, పాషా, ఉప్పలయ్య, దడువాయి సంఘం అధ్యక్షుడు ఆంగోతు మంగీలాల్, కంది వెంకన్న, శ్రీనివాస్, సాంబయ్య పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్య తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాగమణి

గార్ల: గార్ల పెద్దచెరువు శిఖం భూమి ఆక్రమించుకున్న భూకబ్జాదారులపై చర్య తీసుకోవాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నాగమణి మంగళవారం తహసీల్దార్ రవీందర్‌కు ఫిర్యాదు చేశారు. గార్ల పెద్దచెరువు శిఖం భూమిలో ఇప్పటికే సుమారు 150 ఎకరాలు కబ్జాకు గురైందన్నారు. చెరువుకు ఆనుకొని ఉన్న సేరిపురం గ్రామానికి చెందిన కొందరు రైతులు ప్రతి ఏటా కొంతమేర భూమిని కబ్జా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా, మండల అధికారులు స్పందించి కబ్జాకు గురైన భూమిని భూఆక్రమణ దారుల నుంచి స్వాధీనం చేసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దేవా, సుమలత, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

‘అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా’



సదస్సులో మాట్లాడుతున్న కేఎస్ గుట్ట

తొర్రూరు: విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీజీఆర్ఎఫ్(ఎన్పీడీసీఎల్) చైర్‌పర్సన్ కేఎస్ గుట్ట అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఆవరణంలో విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సును నిర్వహించి, వినియోగదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కేఎస్ గుట్ట మాట్లాడుతూ.. తొర్రూరు డివిజన్ ప్రాంతంలో నివాసం ఉంటున్న అన్నివర్గాల ప్రజలు, రైతులకు విద్యుత్ సరఫరాలో ఏ చిన్న సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం వచ్చిన వెంటనే గ్రామ, మండల స్థాయి విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు బిలాల్‌భాషా, నరేందర్, మధుసూదన్, ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న రమేష్

మహబూబాబాద్ రూరల్: విద్యారంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బలాష్టి రమేష్ అన్నారు. మండలంలోని అమనగల్ గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం కార్యకర్తల సమావేశం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని యువజన సంఘం బాధ్యులు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కంకణబద్ధులై అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఇటీవల జరిగిన శాసనసభ, పార్లమెంటు ఎన్నికలకు ముందుకు వచ్చిన పార్టీలు ఏ పార్టీ కూడా తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలందరికీ ఉచిత విద్య అందిస్తామని తెలియజేయలేదన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం పనిచేసే మేధావులు కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతున్నప్పటికీ దానిని పక్కనపెట్టి కులమతాల పేరిట పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేసి జాతీయ సమైక్యత విలువలకు తూట్లు పొడుస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్.ప్రవీణ్, వంశీ, గంగరాజు, వరుణ్, సభ్యులు పాల్గొన్నారు.

నివాళి

బయ్యారం: గోదావరిలోయ ప్రతిఘటన నిర్మాత చంద్రపుల్లారెడ్డి జీవిత సహచరిగా విప్లవోద్యమ విస్తరణకు కృషి చేసిన రాధక్క స్మృతి ఉద్యమానికి తీరనిలోటు అని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. బయ్యారంలో మంగళవారం రాధక్క సంతాపసభను నిర్వహించారు. కార్యక్రమంలో రామగిరి భిక్షం, పద్మ, నాగేశ్వరరావు, బుచ్చయ్య పాల్గొన్నారు.

14న వాహనాల వేలం

మహబూబాబాద్ రూరల్: గుడుంబా, బెల్లం సరఫరా చేస్తూ వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వరంగల్ డిప్యూటీ కమిషనర్ జి.అంజన్ రావు డీపీఈఓ బి.కిరణ్ ఆదేశాల మేరకు ఈనెల 14వ తేదీ శుక్రవారం ఉదయం 11గంటలకు మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.చిరంజీవి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలంపాటలో పాల్గొనే వారు అట్టి వాహన ధరలో 50శాతం సొమ్మును డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ మహబూబాబాద్ పేరున డీడీ తీయాలని సూచించారు. వేలంపాటలో ఉంచబడిన వాహనాలు మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్, కురవి, సీరోలు, డోర్నకల్, గార్ల, బయ్యారం పోలీస్‌స్టేషన్లలో ఉన్నాయన్నారు. వేలంలో వాహనం వచ్చిన తర్వాత వాహనం తీసుకోని పక్షంలో డీడీ ప్రభుత్వ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని, ఒకవేళ వేలంపాటలో పాల్గొని వాహనం రాకుంటే డీడీ వారికి తిరిగి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

యూనిఫాం సిద్ధం

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాం అందించాలనే లక్ష్యంతో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల ద్వారా నెరవేరింది. నేడు ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లోని 53ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న మొత్తం 2,948 మంది విద్యార్థులకు యూనిఫాం సిద్ధం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికి యూనిఫాం అందజేస్తామని ఏపీఎం వరదయ్య మంగళవారం తెలిపారు.

సంక్షిప్త సమాచారం

రేపు వాహనాల వేలం

గూడూరు: మండల కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో బుధవారం జరుగనున్న వాహనాల వేలం కొన్ని అనివార్య కారణాలతో గురువారానికి వాయిదా పడినట్లు సీఐ ఎస్. భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాడు.

విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలి

కేసముద్రం: ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్య తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

చెక్కుల పంపిణీ

కొత్తగూడ: అసెంబ్లీ ఎన్నికల ముందు మంజూరు అయిన కల్యాణ లక్ష్మి చెక్కులను ఎంపీపీ బానోతు విజయరూప్‌సింగ్ మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రయంలో జెడ్పీటీసీ సభ్యురాలు పుష్పలత, తహసీల్దార్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



మహబూబాబాద్ రూరల్: మండలంలోని లక్ష్మీపురం(బి) గ్రామానికి చెందిన ద్విచక్ర వాహన మెకానిక్ 35 ఏళ్ల వయసుగల ఎస్.కె.అజ్మతుల్లా కనిపించకుండా పోవటంతో అతడి తండ్రి ఇమాం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి మంగళవారం తెలిపారు. ఆదివారం రాత్రి ఇంటికి వచ్చిన అజ్మతుల్లా సోమవారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నూతన కమిటీ ఎన్నిక

కేసముద్రం: కేసముద్రంస్టేషన్ మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ నూతన కమిటీని మంగళవారం మండల కేంద్రంలో కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ ఎలక్షన్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం అధ్యక్షురాలిగా సందిరి అనసూర్య, ఉపాధ్యక్షురాలు డోలి సుగుణ, కార్యదర్శి సరళ, ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుతోపాటు బంగారం ఇవ్వాలి

బయ్యారం: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు తులం బంగారంను పెండ్లి కానుకగా పంపిణీ చేయాలని పీవైఎల్ రాష్ట్ర నాయకులు తుడుం వీరభద్రం ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బయ్యారంలో ఆయన మాట్లాడారు. లక్ష రూపాయలతోపాటు తులం బంగారం ఇస్తామని వాగ్దానం ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత బంగారం ఇవ్వకుండా కేవలం చెక్కు ఇస్తూ మోసం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ప్రభాకర్, రాకేష్ పాల్గొన్నారు.

కలప నరికివేత

గూడూరు: మండలంలోని మచ్చర్ల శివారు గండి చెరువు అటవీ ప్రాంతంలో మంగళవారం కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు టేకు, పలు రకాల భారీ చెట్లను నరికి నిల్వ చేశారు. ఈ విషయం తెల్సుకున్న ఎఫ్ఆర్వో సురేష్, అధికారులు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకొని నిల్వ ఉన్న కలప అద్దెను పరిశీలించారు. ఈ విషయమై ఎఫ్ఆర్వోను అడగ్గా అక్రమ కలప దందాదారులు నరికి ఉంటారని, ఎవరా అనేది విచారణ జరుపుతున్నామని తెలిపారు.

విజయవంతం చేయాలి

దంతాలపల్లి: నేడు జరిగే బడిబాట కార్యక్రమంను విజయవంతం చేయాలని ఎంఈఓ గుగులోతు రాము మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ పాల్గొని వివిధ కార్యక్రమాలను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు

కురవి: రానున్న కాలంలో ప్రజాఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచే విధంగా పెద్ద బలమైన సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మించుకోవాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని తట్టుపల్లి గ్రామంలో జరిగిన నాలుగు రోజుల ప్రజానాట్యమండలి రాజకీయ శిక్షణా తరగతులు ముగిశాయి.

ప్రవేశాల సంఖ్య పెంచాలి

డోర్నకల్: ముల్కలపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచాలని హెచ్ఎం రుక్మానందరావు కోరారు. పాఠశాలల పునఃప్రారంభాన్ని పురస్కరించుకుని ముల్కలపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం బడిబాట, విద్యార్థుల అడ్మిషన్లపై నిర్వహించిన సమావేశంలో హెచ్ఎం మాట్లాడారు.

సర్వే పనుల పరిశీలన

దంతాలపల్లి: మండలంలోని బీరిశెట్టిగూడెం తోపాటు పలు గ్రామాల్లో జరుగుతున్న మిషన్ భగీరథ సర్వే పనులను ఎంపీడీఓ వివేక్‌రామ్ పరిశీలించారు. మంగళవారం పలు గ్రామాలలో ఆయన పర్యటించి సర్వే పనులపై ఆరా తీశారు. సకాలంలో పనులు పూర్తి కావాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ అఫ్సర్ పాషా, కార్యదర్శి అక్షర, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రామ్‌ప్రసాద్ బిస్మిల్‌కు నివాళి



నెహ్రూసెంటర్: హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను స్థాపించి ఎన్నో విప్లవ ఉద్యమాలకు నాంది పలికిన స్వాతంత్ర్య సమరయోధుడు రామ్‌ప్రసాద్‌బిస్మిల్ అని విద్యుత్‌శాఖ సబ్ ఇంజనీర్ వెంకటేష్, నేతాజీసేవా సమితి అధ్యక్షుడు కందుల నాగరాజు కొనియాడారు. బిస్మిల్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మంగళవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో వివేక, శంకర్, విశ్వనాథం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏఈఓలను విధుల్లోకి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ఏఈఓలు

మహబూబాబాద్ రూరల్/మహబూబాబాద్/తొర్రూరు రూరల్: జిల్లాలోని తొర్రూరు మండలం హరిపిరాల, అమ్మాపురం, వెలికట్ట గ్రామాల ఏఈఓలు అరవింద్, జమున, దీపికను అన్యాయంగా సస్పెండ్ చేశారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ నల్లబ్యాడ్జీలతో ఏఈఓలు మహబూబాబాద్ రైతువేదిక ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. జీలుగ విత్తనాల అమ్మకాలలో జరిగిన అక్రమాలతో సదరు ఏఈఓలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. జీలుగ విత్తనాల విక్రయ కేంద్రాల యజమానులు, ఏఈఓల రిపోర్టులను తారుమారు చేసి మరిపెడ ఏడీఏ తొర్రూరు మండల వ్యవసాయ అధికారికి అనుకూలంగా రిపోర్టు పంపారని తెలిపారు. ఏవిధమైన పొరపాటు చేయని ఏఈఓలపై అకారణంగా సస్పెన్షన్ వేటు వేశారని పేర్కొన్నారు. సంఘటనపై కలెక్టర్ మళ్లీ విచారణ జరిపించి అక్రమాలకు బాధ్యులైన వారిపై చర్య తీసుకోవాలని కోరారు. సస్పెన్షన్ ఎత్తి వేయాలని టీఎన్జీఓఎస్ జిల్లా అధ్యక్షుడు వి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

విత్తన అమ్మకాల్లో అవకతవకలు



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపెల్లి రవి

తొర్రూరు/తొర్రూరు రూరల్: జీలుగ విత్తనాల అమ్మకాల్లో జరిగిన అవకతవకలపై స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలని సీపీఐ ఎంఎల్(ప్రజాపంథా) పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపెల్లి రవి కోరారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రవి మాట్లాడుతూ.. తొర్రూరులోని ఆగ్రోస్ రైతు సేవా సంస్థల నిర్వాహకులు, వ్యవసాయశాఖ అధికారులు కుమ్మక్కై సుమారు 1600 విత్తన బస్తాలను గోల్‌మాల్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలించి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, పాపారావు, అనిల్, నవీన్ పాల్గొన్నారు. జీలుగ విత్తనాల అవకతవకలపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలని జెడ్పీ ఫ్లోర్‌లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

గిరిజన భూములకు రక్షణ కల్పించాలి



ధర్నా చేస్తున్న సంఘాల నాయకులు

మహబూబాబాద్: గిరిజన భూములకు రక్షణ కల్పించాలని గిరిజన ఐక్య సంఘాల నాయకులు రమేష్, రాములు, వెంకన్న డిమాండ్ చేశారు. గిరిజన ఐక్య సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కోర్టు కేసుల్లో ఉన్న భూములకు కూడా గృహ నిర్మాణ అనుమతులు ఇవ్వడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. మానుకోట మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సంబంధిత అధికారులు విచారణ చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గడికోటను తొలగించాలని వినతి

పెద్దవంగర: నిజాం పాలనలో నిర్మించిన చారిత్రకమైన రాతి కట్టడంతో నిర్మించిన కోట సమస్యల సాధనకు కృషి చేస్తానని తహసీల్దార్ మహేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానికులు గ్రామంలో ఉన్న నాటి నిజాం కాలంలో శత్రువుల రాకను పసిగట్టి, వారిని నివారించేందుకు రజాకార్ల కోసం నిర్మించిన గడికోట శిథిలావస్థకు చేరుకుంది. దీనిని తొలగించాలని కోరుతూ సభలో తీర్మానించిన పత్రాన్ని గ్రామ ప్రత్యేక అధికారులు తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వేముల వెంకన్న, దుంపల కుమారస్వామి, బుచ్చి రాములు, జీపీ కార్యదర్శి హేమలత, ఏఎన్ఎం నాగజ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, రమాదేవి పాల్గొన్నారు.

మెడికల్ కిట్ అందజేత

గార్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నార్మల్ డెలివరీలు ఎక్కువగా అయ్యేలా ప్రోత్సహిస్తామని గార్ల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ చింత రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని గోపాలపురం చెందిన నాగమణి స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రిలో నార్మల్ డెలివరీ చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. డెలివరీ అనంతరం నాగమణికి డెలివరీ కిట్‌ను డాక్టర్ అందజేశారు. కార్యక్రమంలో హనుమంతరావు, స్టాఫ్‌నర్సులు సుధ నాగమణి, పుష్ప పాల్గొన్నారు.

మున్నూరుకాపులు రాజకీయంగా ఎదగాలి



నెహ్రూసెంటర్: మున్నూరుకాపులు రాష్ట్రంలో ముఖ్యమంత్రి స్థాయి వరకు రాజకీయంగా ఎదగాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు అన్నారు. ఇటీవల ఎమ్మెల్సీ, లోకసభ ఎన్నికల్లో మున్నూరుకాపుల విజయోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జనాభాకు తోడు వివిధ రంగాల్లో ఉత్పత్తి శ్రేణి వర్గాలకు ఆర్థికరంగానికి వెన్నెముకగా మున్నూరుకాపులు ఉన్నారన్నారు. ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న, కేంద్ర మంత్రిగా బండి సంజయ్‌కుమార్ నియామకంతో కాపుల్లో నూతనోత్సహం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్, శ్రీకాంత్, కుమార్, రమేష్, ఉపేందర్, జగ్గయ్య, కిశోర్, మహేష్ పాల్గొన్నారు